

ఆస్పరిలో ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి హాజరైన పొదుపు మహిళలు



ఆస్పరిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.1.58 కోట్ల చెక్కును అందజేస్తున్న నాయకులు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఆస్పరి: రాష్ట్రంలో మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కేడీసీసీ జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర అన్నారు. మంగళవారం ఆస్పరిలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కట్టెల భాగ్యమ్మ అధ్యక్షతన మండలంలోని 384 డ్వాక్రా గ్రూపు సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.1.58 కోట్లు మెగా చెక్కును మూలింటి రాఘవేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను మహిళల పేరిట అమలుచేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రుణమాఫీ, సున్నా వడ్డీ అమలు చేయకుండా పొదుపు మహిళలను నట్టేట ముంచారని, వారి ఉసురు తగిలి 2019 ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందారన్నారు. ఆస్పరి మండలంలో నాలుగేళ్లలో వైఎస్సార్ ఆసరా పథకం కింద 3,946 మంది పొదుపు మహిళలకు మొత్తం రూ.6.35 కోట్లు అందజేసినట్లు వివరించారు. ఏపీజీబీ మేనేజర్ వంశీకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ అనీల్‌కుమార్, మండల సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకుర రామాంజినేయులు పాల్గొన్నారు.

దేవనకొండలో ఆసరా చెక్కు పంపిణీ

దేవనకొండ: వైఎస్సార్ ఆసరా పథకం మహిళల బంగారు భవితకు పునాది అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున అన్నారు. ఈ మేరకు మంగళవారం దేవనకొండలోని తిక్కతాత ఫంక్షన్ హాల్‌లో నాలుగో విడత ఆసరా నిధుల విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అక్కచెల్లెమ్మల ఆర్థిక ప్రగతికి అండగా నిలుస్తున్నారన్నారు. నాలుగో విడత ఆసరా పథకం కింద రూ.1.92 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. 621 స్వయం సహాయక సంఘాల్లోని 6150 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయన్నారు. ఎంపీటీసీ తపాల శ్రీనివాసులు, లుముంబా, వెలుగు ఏపీఎం రమణ, నరసన్న, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



దేవనకొండలో వైఎస్సార్ ఆసరా చెక్కును విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, వెలుగు సిబ్బంది

రూ.5 లక్షలు రుణమాఫీ అయ్యింది



మా విరాట్ గ్రూపునకు వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగేళ్లలో రూ.5 లక్షలు రుణమాఫీ అయ్యింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్లుగా మహిళలకు న్యాయం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ లబ్ధితో పండ్ల వ్యాపారం పెట్టుకున్నా. సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కల్పించారు.

– చంద్రకళ ఆస్పరి గ్రామం

జగనన్నకే మా ఓటు



మా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే వచ్చే ఎన్నికల్లో ఓటు వేస్తాం, కచ్చితంగా జగనన్నే మళ్లీ సీఎం అవుతారు. నేను వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.12 వేలు, చేయూత పథకం ద్వారా లబ్ధిపొందాను. నా భర్తకు వృద్ధాప్య పింఛన్, మనవళ్లకు అమ్మ ఒడి పథకం వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో కిరాణా దుకాణం పెట్టుకున్నా. మా కుటుంబానికి ఇంత మేలు చేసిన జగనన్న రుణం ఓటు వేసి తీర్చుకుంటాం.

– దస్తగిరమ్మ జోహరాపురం, ఆస్పరి మండలం

పొట్టేళ్లు కొనుక్కున్నా



ప్రభుత్వం నుంచి వచ్చిన సంక్షేమ లబ్ధితో రెండు పొట్టేళ్లు కొనుక్కున్నా. వీటిని బాగా మేపి మంచి ధరకు అమ్ముకుంటా. నేను అంకయ్య స్వామి గ్రూపులో సభ్యురాలిని. నాలుగేళ్లలో ఆసరా పథకం కింద రూ.48 వేలు వచ్చాయి. నా భర్త అంజినయ్యకు పింఛన్, నా మనవళ్లకు అమ్మ ఒడి పథకం వస్తుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా కుటుంబానికి ఎంతో మేలు చేశారు. ఆయనకు ధన్యవాదాలు.

– ఈశ్వరమ్మ అట్టికల్లు గ్రామం, ఆస్పరి మండలం

క్లుప్తంగా

చురుగ్గా కులగణన నమోదు

తుగ్గలి: రాష్ట్ర వ్యాప్తంగా గతనెల 19 నుంచి చేపట్టిన కులగణన మండలంలో చురుగ్గా సాగుతోంది. మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఈనెల 9వ తేదీలోపు నమోదు చేసుకోవచ్చని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండలంలో ఆయా సచివాయాల్లో 20,468 కుటుంబాల్లో సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 19,006 (92.86 శాతం) కుటుంబాల్లో సర్వే పూర్తయిందన్నారు. పలు కారణాలతో ఇప్పటికీ నమోదు చేసుకోని వారు వెంటనే వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

దేవనకొండ: మండల కేంద్రంలోని టర్నింగ్ వద్ద రూ.5 లక్షలు ఎంపీపీ నిధులతో మురుగు కాలువల నిర్మాణం కోసం మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు లుముంబా భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు వెంటనే నిధులు మంజూరు చేయించి డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, అంజి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ రమేష్‌బాబు

మద్దికెర: మద్దికెర ఎస్‌ఐగా రమేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రిజ్వాన్ మహమ్మద్ చిప్పగిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న రమేష్‌బాబు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ - కేవైసీ చేయించుకోండి

గోనెగండ్ల: రబీ సీజన్‌లో పంటలను సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత రైతులకు సూచించారు. వారు మంగళవారం మండలంలోని హెచ్.కై రవాడిలో రైతు భరోసా కేంద్రాలు–1, 2, అల్వాల, పెద్దనేలటూర్‌లో–1, 2 రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది చేస్తున్న ఈ-కేవైసీల వివరాలను తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఇప్పటివరకు 60 శాతం పూర్తయిందని, రైతులందరూ ఈనెల 15వ తేదీలోపు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి



జిల్లాస్థాయి విజేతలైన తుగ్గలి క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

తుగ్గలి: ఆడుదాం–ఆంధ్ర జిల్లాస్థాయి బాలికల ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలని హెచ్‌ఎం విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతగా నిలిచిన బాలికల జట్టు, రన్నర్స్‌గా నిలిచిన బాలుర జట్లను ఆమె అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నైపుణ్యం గల క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్ర ఒక మంచి అవకాశమని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడాకారులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. వీఆర్వో రహిమాన్, పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, ఫిజికల్ డైరెక్టర్ చందూనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆలూరు: పది పబ్లిక్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆలూరు బార్ అసోసియేషన్ నాయకుడు శేక్షావలి విద్యార్థులకు సూచించారు. పది పబ్లిక్ రాసే విద్యార్థుల కోసం ఎస్ఎఫ్ఐ తయారుచేసిన ప్రజ్ఞా వికాసం మోడల్ పేపర్ల ఆయన స్థానిక మోడల్ స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ రాఘవరావు ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలకు ప్రశాంతంగా సన్నద్ధం కావాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్, త్రిష, జమీల, తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా సద్వినియోగం చేసుకోండి

నందవరం: పాడి రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ పశు బీమా' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యుడు డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. ఆయన మంగళవారం జోహరాపురం గ్రామంలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు నామమాత్రపు రుసుముతో బీమా చేయిస్తే మేలు జాతి పశువులకు రూ.30 వేలు, నాటు పశువులకు రూ.15 వేలు ప్రభుత్వం బీమా చెల్లిస్తుందని పేర్కొన్నారు. బీమా కోసం రైతులు మూడేళ్లకు గానూ రూ.398 ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకోవాలని కోరారు. విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా సుంకులమ్మ దేవర

తుగ్గలి: అమినాబాద్‌లో సుంకులమ్మ ఊరి దేవరను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజామునుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని మేళతాళాలతో అమ్మవారి ఆలయాన్ని సందర్శించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలకు బంధుమిత్రులతో పాటు, వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామానికి చెందిన జవాన్లు, ఇతరుల రాకతో సందడిగా మారింది. కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్.రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతులు, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆలూరు రూరల్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మొలగవల్లి పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ వైద్యాధికారి రఘురామిరెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం ఆస్పత్రి ఇన్‌చార్జ్ డీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 24 గంటలు రోగులకు వైద్యం అందించాలన్నారు. ఇంటి వద్దకే వైద్యం, జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించవద్దని సూచించారు. ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలైన ఏఎన్ఎం యశోద, ఆశా కార్యకర్త కళావతిలను సన్మానించారు. వైద్యులు రవి, రేష్మా సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చిప్పగిరి: దేవనకొండ మండలంలోని లక్కందిన్నె గ్రామంలో శివాలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి మంగళవారం రూ.30 వేలను విరాళంగా అందించారు. తమ అభ్యర్థనపై వెంటనే స్పందించినందుకు గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధం సభకు సన్నద్ధమవుదాం



చిప్పగిరిలో సిద్ధం పోస్టర్‌ను విడుదల చేస్తున్న విరూపాక్షి, నాయకులు

ఆలూరు రూరల్: ఈ నెల 11న అనంతపురంలో జరిగే సిద్ధం బహిరంగ సభకు కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండలంలోని మొలగవల్లి, మొగవల్లి కొట్టాల గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. టీడీపీ, జనసేన కుట్రలను క్షేత్రస్థాయిలోనే తిప్పికొట్టాలన్నారు. అనంతరం మొలగవల్లి కొట్టాల గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మొలగవల్లిలో బీజేపీ నాయకులు అనిల్ రెడ్డి కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న ఈరన్న, మారయ్య, లక్ష్మిరెడ్డి, రామాంజినేయులు, వీరేష్ పాల్గొన్నారు.

టీడీపీని తరిమికొట్టేందుకు ప్రజలు 'సిద్ధం'

చిప్పగిరి: రాష్ట్రం నుండి టీడీపీ, జనసేన పార్టీలను శాశ్వతంగా తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరూపాక్షి అన్నారు. మంగళవారం స్థానిక గోవిందప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న అనంతపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి తరలి రావాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. పార్టీ నాయకులు మారయ్య, మల్లికార్జున, ప్రేమ్‌కుమార్, సేనాపతి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

హాలహర్వి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 1 గంటకు 'ఎన్నికలకు సిద్ధం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. ఆయన మంగళవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలసి మాట్లాడారు. 'ఎన్నికలకు సిద్ధం' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఆలూరు ఇన్‌చార్జ్ విరుపాక్షి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు, తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పచ్చారపల్లి రామ్‌రెడ్డి, జనార్ధన్‌నాయుడు, రంజిత్‌కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఉంటుందని మండల కన్వీనర్ షఫీవుల్లా తెలిపారు. పార్టీ జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారని వెల్లడించారు.

నిత్యావసర సరుకుల అందజేత

హొళగుంద: మండలంలోని మార్లమడికి, హొళగుంద తదితర గ్రామాలకు చెందిన అనాథ వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదోని వివేకానంద సేవా సంస్థ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, భారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ధార్థగౌడ్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు రవికాంత్, శ్రీధర్‌శెట్టి తదితరులు బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చెక్కెర ఇతర నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ప్రతి నెలా సరుకులను అందిస్తూ చేయూతనిస్తున్నారు.

నేడు విద్యుత్ కోతలు

తుగ్గలి: రానున్న వేసవి దృష్ట్యా అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే పనుల నిమిత్తం జొన్నగిరి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం పగలంతా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న క్రాంతికుమార్‌కు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ మెటల్ ఆక్సైట్, సల్ఫైడ్ బెస్ట్ హెటిరో జంక్షన్ నానోకాంపోసిట్స్ ఫర్ గ్యాస్ సెన్సింగ్ అప్లికేషన్' అనే అంశంపై ప్రొఫెసర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఆలూరు రూరల్: సమాజంలో ప్రజల మధ్య అసమానతలు తొలగించేందుకు త్రైత సిద్ధాంత భగవద్గీత దోహదం చేస్తోందని, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్, పాండురంగ గుడి ప్రాంతంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ధర్మ స్థాపన త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కమిటీ అధ్యక్షులు రవి కుమార్, దేవేంద్ర, చంద్రశేఖర్, మోహన్ కృష్ణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'



రాతనలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



లక్కసాగరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



పి.కోటకొండలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తుగ్గలి: పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని సర్పంచ్ గూడూరు రాచప్ప అన్నారు. మంగళవారం రాతనలో నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ టీఎండీ హుసేన్, మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటి వద్దకే వైద్యసేవలు

కృష్ణగిరి: దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇళ్ల వద్దకే వైద్యసేవలను తీసుకువచ్చారని వైద్యాధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని లక్కసాగరం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.వైద్యాధికారి మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులను నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రారంభించి ఇళ్ల వద్దకే వైద్యం అందిస్తున్నారని వివరించారు. గ్రామ సచివాలయ పరిధిలోని నాలుగు గ్రామాల నుంచి వచ్చిన 403 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీహెచ్ఈఓ గజేంద్రారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పి.కోటకొండలో సురక్ష హెల్త్ క్యాంపు

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో మంగళవారం 'రెండో' విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్, కంటి, చెవి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేసినట్లు వైద్యులు అరుణజ్యోతి తెలిపారు. సూపర్‌వైజర్లు రంగస్వామి, బాషావలి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ చైర్మన్ మద్దిలేటి, కార్యదర్శి వరప్రసాద్ కోరారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 12వ పీఆర్సీ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని కోరారు. పెండిగ్ ఉన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఎర్న్‌డ్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అసోసియేషన్ నాయకులు ఏపీ వీరన్న, మల్లికార్జున, కరె కృష్ణ, శివరాం రెడ్డి, యాదగిరి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు వాటిపై పూర్తి హక్కులు కల్పించేందుకు పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలవ్యాప్తంగా చురుగ్గా సాగుతోందని ఈఓఆర్డీ నాగేష్ తెలిపారు. మంగళవారం ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 382 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఈఓ సతీష్, సచివాలయ సిబ్బంది కరుణాకర్, కిషోర్, విరుపాక్షి, రంగస్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని తహసీల్దార్ రజాక్‌వలి మంగళవారం తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం వల్ల అవసరమైనప్పుడు బ్యాంకు రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని, దానవిక్రయాది సర్వహక్కులు లభిస్తాయన్నారు. ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎంవీఐ శిశిర దీప్తి

ఎమ్మిగనూరుటౌన్: వాహన డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఆదోని ఎంవీఐ శిశిర దీప్తి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మినీ లారీ అసోసియేషన్ కార్యాలయంలో పలు వాహన డ్రైవర్లతో ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు పాటించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదని, మత్తు పదార్థాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ బాబు మాట్లాడగా కానిస్టేబుల్ నాగేశ్వరరావు, మినీ లారీ అసోసియేషన్ సంఘ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న నేమకల్లు సర్పంచి ప్రేమ్‌కుమార్

చిప్పగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలే తమకు శిరోధార్యం అని నేమకల్లు గ్రామ సర్పంచ్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు బుసినె విరుపాక్షిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటించిందన్నారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రాణం ఉన్నంత వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమానులుగానే ఉంటామని, అధిష్టానం ఆదేశాలు తూచా తప్పక పాటిస్తామన్నారు. అయితే నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షికి మద్దతు తెలపవద్దని, సహకరించవద్దని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ నారాయణ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. తమకు ఏమైనా జరిగితే ఆయనదే బాధ్యత అన్నారు. నాయకులు సేనాపతి, నాగేంద్ర, సుంకన్న, సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

సంగాలలో పెద్దపుల్లయ్య ఆరాధన

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో వెలసిన పెద్దపుల్లయ్య ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆల్ యూద్రూష్ దర్గా కమిటీ సభ్యులు గిడ్డయ్య, దస్తగిరి తదితరులు మంగళవారం తెలిపారు. గూటుపల్లె పెద్దరాజు స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమం గత తొమ్మిదేళ్లుగా చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 10, 11 తేదీల్లో పెద్దపుల్లయ్య దర్గాలో గంధం సమర్పించి రాత్రి కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ రెండు రోజులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు.

దస్తగిరి స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు ఘనంగా జరిగింది. మంగళవారం దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతేహాల్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుదీపాలతో విశేషంగా అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించి గెలుపొందిన జట్లకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, ఈరన్న, డీల్లర్ యల్లప్ప గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మస్తానయ్య స్వామి ఉరుసు



ముక్కెల్ల మస్తానయ్య స్వామి దర్గాలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తుగ్గలి: మండల పరిధిలోని ముక్కెల్లలో మస్తానయ్య స్వామి ఉరుసును గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం దర్గాలో మస్తానయ్య సమాధిని పూలచద్దర్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. ముజావర్లు, భక్తులు దర్గాలో ఫాతేహాలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేకువజామున గ్రామంలో మేళతాళాల నడుమ షంషీర్‌ను ఊరేగించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు: ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ చైర్మెన్ మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో మంగళవారం నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకుడు శేఖర్ ఆధ్వర్యంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉద్యోగులకు జీపీఎస్, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండర్ సెలవులు, ఓపీఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

12న వృషభాల బండలాగుడు పోటీలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో శ్రీ పామయ్య తాత తిరునాల సందర్భంగా ఈ నెల 12న రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, రంగయ్య, రామాంజనేయులు, జగదీశ్వరరెడ్డి తెలిపారు. వారు మంగళవారం పోటీల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 98498 93101, 90005 08216 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.